
త్రిపురాంతకంలో ఎమ్మెల్యే తాటిపర్తి, ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి


త్రిపురాంతకంలో స్వామివారి పూజలో పాల్గొన్న పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి


త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

సర్వం శివమయం

- అంగరంగ వైభవంగా మహాశివరాత్రి మహోత్సవాలు
- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
- ఆలయాల్లో శివకల్యాణం, అన్నదానాలు

కురిచేడు: మహాశివుని లింగోద్భవమైన మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం దర్శి నియోజకవర్గంలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకటలాడాయి. కురిచేడులోని శ్రీజ్ఞానప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంతోపాటు మండలంలో పడమర గంగవరం గ్రామంలో వేంచేసి ఉన్న చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, కల్లూరులోని త్రిపురాంతకేశ్వర, మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేకంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పడమర గంగవరం గ్రామంలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో రంగు రంగు పూలతో శివలింగాకారాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కురిచేడు, పడమర గంగవరం, కల్లూరు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం దాతలు ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ కాల అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు పరిధిలో ఉన్న గుంటి గంగమ్మ సన్నిధిలోని మల్లికార్జున స్వామి,


పుల్లలచెరువులో ప్రత్యేక పూజలు అందుకుంటున్న సప్తకోటేశ్వరుడు

మాధవరం పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి, బొద్దికూరపాడు గంగా పర్వత వర్ధని సోమేశ్వర స్వామి, లక్కవరం గంగా భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరి ఆలయాలు, కృష్ణ స్వామి ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్కవరం గ్రామంలో హోమాలు చేసి, స్వామివారిని ఊరేగించారు, అన్ని శివాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి, బీ చంద్రశేఖర్ శాస్త్రి, వెంకట కృష్ణారావు, ప్రకాష్ రావు, కృష్ణుడు పంతులు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు

ఘనంగా శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం

దొనకొండ: ఆనంద ఆశ్రమంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉభయ దాతలు మాడిశెట్టి సత్య ప్రకాష్ దంపతులు, మాడిశెట్టి వెంకట సురేష్‌బాబు దంపతులు, కాళ్ల వెంకట హనుమంతరావు దంపతులు, రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు కళ్యాణం జరిపించారు. ఆశ్రమం పూజారి మణిబాబు శర్మ ఉదయం 5 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామార్చనలు, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. సామూహిక హారతులిచ్చారు. గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు భైరవానందస్వామి


తాళ్లూరులో ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వరుడు

అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం శివ పార్వతులను పుర వీధుల్లో ఊరేగించారు. కొచ్చెర్లకోట, చందవరం, పెద్దగుడిపాడు, గంగదేవిపల్లి, ఇండ్లచెరువు శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా భక్తులు శివ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

ముండ్లమూరు మండలంలో..

ముండ్లమూరు (కురిచేడు): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ముండ్లమూరు మండలంలోని శివాలయాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. పెదరావిపాడులోని భ్రమరాంబసమేత రాజమల్లేశ్వరస్వామి, ముండ్లమూరులోనిమల్లమాంబసమేత చెన్నమల్లేశ్వరస్వామి, మారెళ్లలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, పసుపుగల్లులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, పులిపాడులోని గంగాపార్వతి సమేత పూర్ణేశ్వరస్వామి, పోలవరంలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, ఉమా మహేశ్వరపురంలోని గంగా పార్వతిసమేత ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులచేత పూజారులు స్వర్ణ సుబ్బారావు, స్వర్ణ శ్రీనివాసరావు, స్వర్ణ నవీన్, దుర్భాకుల నగేష్ శర్మలు పూజలు నిర్వహించారు. నాయుడుపాలెం గ్రామానికి చెందిన మారెళ్ల విద్యుత్ లైన్‌మెన్ పుష్పగిరి ఆంజనేయులు, మీనాక్షి లు సహాయ సహకారాలు అందించారు.

దర్శిలో..

దర్శి(కురిచేడు): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూకట్టారు. అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త నారపుశెట్టి శివప్రసాద్ తెలిపారు. వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదవితరణ జరిగింది. ఒంగోలుకు చెందిన శివ సాయి నాట్య మండలి వారిచే భరత నాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


పెద్దారవీడులో ప్రత్యేక అలంకారంలో శివలింగం

శివ నామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో బుధవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయం 5 గంటలకే దేవాలయాలకు చేరుకుని భక్తి శ్రద్ధలతో మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరాలయం, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి మల్లికార్జున స్వామికి ప్రభాతసేవ, గణపతిసేవ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో వెలసిన రామలింగేశ్వరాలయంలో స్వామి వారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని మోట్లమల్లికార్జునపురం మోట్లమల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీశైలం తరలి వెళ్లే యాత్రికులకు అన్నదానంచేశారు.

శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పెద్దారవీడులో దుర్గా సమేత బోగేశ్వరస్వామి, గొబ్బూరులో జ్ఞాన ప్రసునాంబా సమేత రామలింగేశ్వరస్వామి, బదీవ్వేడు చెర్లోపల్లిలో భ్రమరాంబ సమేత ఓంకారేశ్వర స్వామి, ఓబులక్కపల్లి, ఏనుగులదిన్నెపాడు గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మేడవరం రాఘవేంద్ర, భరద్వాజశర్మలు స్వామికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. చట్లమిట్ల గ్రామం సాయిబాబా మదిరంలో సాయిసేవా సంఘం ఆధ్వర్యంలో, శివాలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శివనామ స్మరణతో మార్మోగిన శైవాలయాలు

యర్రగొండపాలెం: మహాశివరాత్రి పండుగ సందర్భంగా బుధవారం స్థానిక శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశాలాక్షి విశ్వేశ్వర స్వామి, కొలుకుల రోడ్డులో ఉన్న పర్వతవర్ధిని సమేత వృక్షికాల మల్లికార్జున స్వామి ఆలయాల్లో వేకువ జాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివార్ల దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

పుల్లలచెరువు: శివరాత్రి సందర్భంగా మండలంలోని శతకోడులోని సప్త కోటేశ్వర స్వామి, మర్రివేముల శివారు ప్రాంతంలో ఉన్న మనేపల్లి లక్ష్మీనరసింహస్వామి, చాపలమడుగు, ముటుకుల పురాతన దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలు ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. చాపలమడుగు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.


వైపాలెంలో విశ్వేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


కురిచేడులో శ్రీకాళహస్తీశ్వరస్వామి మూలవిరాట్


ముండ్లమూరు: శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న పూజారులు


దర్శిలో భరతనాట్యం చేస్తున్న కళాకారులు


చట్లమిట్ల సాయిబాబా మందిరంలో శివస్వాములకు అన్నదానం

త్రిపురాంతకంలో పోటెత్తిన భక్తులు

- పార్వతి త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో వైభవంగా బ్రహ్మోత్సవాలు

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన పార్వతీ త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరీదేవి ఆలయాల్లో మహాశివరాత్రి మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ ఈప్రాంతమంతా శివనామస్మరణతో మారుమోగింది. వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులుతీరారు. పండితులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా భక్తులచే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. రెండు గోపురాల వైపు నుంచి మెట్లదారిన భక్తులు దర్శనానికి వచ్చేలా చర్యలు తీసుకున్నా భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మహాశివరాత్రి సందర్భంగా జాగారం రాత్రి ఆలయంలో లింగోద్భవ దర్శనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద తహసీల్దార్ శ్రీనివాస్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, కార్యనిర్వహణాధికారిణి డి.రజనీకుమారి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల వద్ద పర్యవేక్షించారు. సేవా బృందాలు, వీహెచ్‌పీ, సేవా భారతి, గిరిప్రదక్షిణ బృందాలతో పాటు, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, కౌంటర్‌లు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర ప్రసాదాలు ఏర్పాటు చేశారు. సామాజిక సత్రాల వద్ద భక్తులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

త్రిపురాంతకేశ్వర బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చిన ప్రముఖులు

పార్వతి త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు ఆయా ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆలయాల్లో ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. వారికి ఆలయాల వద్ద అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారితోపాటు పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఎస్పీ ఏఆర్ దామోదర్, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఎస్పీ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు కోట్ల సుబ్బారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు శింగారెడ్డి పోలిరెడ్డి, కొప్పర్తి ఓబులరెడ్డి, సర్పంచ్‌లు పి.వెంకటలక్ష్మి, ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, నాయకులు దగ్గుల గోపాల్‌రెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, సింగా ప్రసాద్, శాసం రంగబాబు, మురారి గాలెయ్య, ఉమామహేశ్వరరెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో స్వామి వారి దర్శనం కోసం వచ్చిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు


దర్శిలో అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి

యాత్రికులకు ధార్మిక సంస్థల దాతృత్వం


ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదానం


కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

- భక్తులకు అన్నదానం, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించిన సేవా సంస్థలు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే యాత్రికులు, శివభక్తులకు మండల పరిధిలోని శ్రీశైలం రహదారిలో పలు ధార్మిక సంస్థలు అన్నదానంతో పాటు, మంచినీరు, మజ్జిగ పాకెట్లను అందజేశాయి. మండల రెడ్ల సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బట్టు సుధాకర రెడ్డి, గంటా రమణారెడ్డి, బట్టు రమణారెడ్డి, గుంటూరు గాలిరెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవ రాయల కాపు, బలిజ ఒంటరి తెగల సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమంలో యామా దాసయ్య, కేతి మురళి, గుర్రాల ప్రసాద్, కమ్మ వెంకటేశ్వర్లు(పండు), రాంశెట్టి కృష్ణ, దర్శినారాయణ, సూరె శివ, రేళ్ల చిన్న కాశీరాములు, వీరిశెట్టి పణీంద్ర తదితరులు పాల్గొన్నారు. మార్కాపురానికి చెందిన శివదీక్ష సంఘం సేవా భారత్ ఆధ్వర్యంలో పలువురు యువకులు అన్నదానం చేశారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దర్శి మండలం తానం చింతల గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంబ, ఉస్మాన్, రమణారెడ్డి, మస్తాన్, జీవన్‌కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. పలు ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం కూడా అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


రెడ్ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్‌రావు


ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ

తాళ్లూరు: వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌బ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్ పేర్కొన్నారు. బుధవారం తాళ్లూరు మండలంలోని దోసకాయలపాడు పంచాయతీ పరిధిలోని తోటవెంగన్నపాలెంలో రూ.48 లక్షల ఆర్‌డబ్ల్యూఎస్ నిధులతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నూతనంగా నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 16 పంచాయతీల్లో 9 గ్రౌండ్ ఫ్లోర్ ట్యాంక్‌లు, 22 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయన్నారు. అయితే రామతీర్థం జలాశయం నుంచి రోజుకు 22 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసి మండలంలోని పలు గ్రామాల తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీఈ రామ్మోహన్‌రావు, జేఈ వలిబాబు, సర్పంచ్ కోట శివలక్ష్మీ, వెంకట రామిరెడ్డి ఉన్నారు.

నేడు గంధ మహోత్సవం

కనిగిరిరూరల్: పట్టణంలో చరిత్రకు సాక్షిగా ఉన్న శ్రీ శ్రీ హజరత్ సయ్యద్ బాదేషా పాష్ఛాహుస్సేని చిష్టవుల్ ఖాదరి 127వ గంధ మహోత్సవం గురువారం జరుగనుంది. కుల, మత వర్గాలకతీతంగా నిర్వహించే ఉరుసు మహోత్సవానికి దర్గా కమిటీ భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. హజరత్ ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుత్, దీప పూల అలంకరణలతో ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దర్గా కమిటి కోరారు.